క్లుప్తంగా

భక్తులను అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై బుధవారం సాయంత్రం ఆలపించిన భక్తిరంజని భక్తులను అలరించింది. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్.సురేఖ పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. సురేఖకు రేవేష్ వయోలిన్, జగన్మోహిని మృదంగంపై చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ధర్మపథం వేదిక వద్దకు చేరుకుని భక్తి గీతాలను ఆస్వాదించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

సత్తా చాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్):పీబీ సిద్ధార్థ కళాశాలలో తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటడం ఆనందంగా ఉందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థిని కీర్తన లేఖ రచన విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. అలాగే కళాశాల నుంచి పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారితో పాటు ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.వి.శాంతకుమారి, ఏ.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9న ఉగాది పంచాంగ శ్రవణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 9వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో భారతీయ సంస్కృతీ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.గోపీచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు మైసూర్ దత్త పీఠం ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ క్రోవి పార్థసారథి ఉగాది పంచాంగ శ్రవణం చేస్తారన్నారు. భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల మనిషి అని ఆయన చేసిన మంచిని అభివృద్ధిని చూసు నచ్చితేనే ఓటు వేయాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష కోరారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఉండే మంచి మనుషులు వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నాని అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వెంకటరెడ్డి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు కూటమిదే ఈ పాపం

- ఐదేళ్లుగా ప్రశాంతంగా పింఛన్ తీసుకుంటున్నాం
- ఇప్పుడు తిరగలేక పోతున్నామని పెన్షనర్ల ఆవేదన
- సెంట్రల్‌లో పింఛన్ల పంపిణీ ప్రారంభం


సింగ్‌నగర్‌లో పింఛన్ కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదేళ్లుగా ప్రశాంతంగా పింఛన్లు తీసుకుంటున్నాం. ప్రతి నెలా మొదటి తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయాల చుట్టూ తిరగలేక పోతున్నాం. ఈ పాపం చంద్రబాబు కూటమిదే అని సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పేర్కొంటున్నారు. ఆయన దుర్మార్గపు రాజకీయాల కోసం మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపడుతున్నారు. పేదలను ఇబ్బంది పెట్టడం చంద్రబాబుకు అలవాటేనని పెన్షన్‌దారులు అంటున్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా ఎప్పుడు పింఛన్ ఇస్తారో తెలియక పడుగాపులు పడేవాళ్లమంటున్నారు. కానీ వైఎస్ జగన్ తమ కష్టాలు తొలగిస్తూ వలంటీర్లను పెట్టి పింఛన్ పంపిణీ చేశారని అంటున్నారు.

పాపం ఊరికినే పోదు..

వృద్ధులను ఇబ్బందులకు గురిచేసిన పాపం ఊరికినే పోదని, చంద్రబాబు మట్టికొట్టుకు పోతారని వృద్ధులు అంటున్నారు. లోఫర్ రాజకీయాలు చేయడం ఆయనకు అలవాటేనని, నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించడంతో మేము కష్టాలు పడాల్సి వస్తుందని మండిపడుతున్నారు. అసలే ఎండాకాలం ఇంటి నుంచి బయటకు రాలేక పోతున్నాం. చంద్రబాబు చేసిన దుర్మార్గపు పనికి ఇబ్బంది పడుతున్నాం అంటూ వృద్ధులు, దివ్యాంగులు శాపనార్థాలు పెడుతున్నారు.

ఉదయం నుంచే పడిగాపులు..

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వంద వార్డు సచివాలయాలు ఉండగా, ఉదయం నుంచే పింఛన్‌దారులు పడుగాపులు కాశారు. మండుటెండలో కూర్చునేందుకు సైతం సరైన స్థలం లేక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మాకు ఐదేళ్ల కిందట పడిన నరకం గుర్తొస్తుందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆకలి ఆయనకు ఏమి తెలుసని పలువురు శాపనార్థాలు పెట్టారు. కాగా బ్యాంకుల నుంచి నగదు తీసుకు వచ్చిన సచివాలయ సిబ్బంది ఒక్కొక్కరికీ పింఛన్ పంపిణీ చేయడం ప్రారంభించారు.

పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి



ఇప్పటి వరకు దర్జాగా ఇంటి వద్దనే పింఛన్ అందుకున్నాను. ఇప్పుడు పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఈ వయస్సులో పింఛన్ కోసం వార్డు సచివాలయం చుట్టూ తిరగాల్సి రావటం ఆందోళనగా ఉంది. ఎప్పుడు పింఛన్ ఇస్తారో అర్థం కావటం లేదు.

–సాంబశివరావు, బుడమేరు మధ్య కట్ట

తలుపుతట్టి పెన్షన్ ఇచ్చే వారు..



సచివాలయం వద్ద మండుటెండలో వేచి ఉంటూ పెన్షన్ తీసుకోవడం ఇబ్బందిగా వుంది. వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీన ఇంటికి వచ్చి తలుపుతట్టి పెన్షన్ ఇచ్చే వారు. ప్రతిపక్షానికి చెందిన నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ కష్టాలు వచ్చాయి.

– ఆశ కస్తూరి, రాజీవ్‌నగర్

వన్‌టౌన్ నుంచి వచ్చాను..



ప్రతి నెలా వలంటీర్ పింఛన్ అందజేసేవారు. ఇప్పుడు నేను వన్‌టౌన్‌లో ఉంటున్న నా కుమారుడు వద్ద ఉంటున్నాను. పింఛన్ కోసం వన్‌టౌన్ నుంచి నా మనుమడి సహాయంతో వచ్చాను. కానీ ఇంత వరకు పింఛన్ ఇవ్వలేదు. ఇప్పటికే ఆటో చార్జీలతో పాటు ఎర్రటి ఎండలో తిరగాల్సి రావటం బాధగా ఉంది.

–ముసలయ్య, దేవీనగర్

మందులకు ఇబ్బందులు



పింఛన్ కోసం సచివాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి కల్పించారు. నాకు వచ్చే పింఛన్ డబ్బులతో మందులు కొనుక్కోవాలి. పింఛన్ రాక ఇబ్బందులు పడుతున్నాను. ఉదయం 7 గంటలకే ఇక్కడకు వచ్చాను. కానీ బ్యాంకు నుంచి డబ్బులు రాలేదని గురువారం ఇస్తామని చెబుతున్నారు.

–అప్పలనాయుడు, జీవీఆర్ నగర్


వృద్ధురాలికి ఆటోలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది


సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు


పింఛన్ కోసం ఆటోలో వస్తున్న వృద్ధులు

అవ్వా తాతల ఉసురు చంద్రబాబుకు తగులుతుంది


64వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

పాయకాపురం(విజయవాడరూరల్): అవ్వా తాతల ఉసురు చంద్రబాబునాయుడుకు తప్పనిసరిగా తగులుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధానగర్ ప్రాంతాల్లో ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బొండా ఉమా ఒక గజినీ..

అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా అవ్వా తాతలకు ఇంటి వద్దకే పింఛన్లు తీసుకెళ్లి పంపిణీ చేస్తుంటే చంద్రబాబు అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వలన పింఛన్ల పంపిణీకి అవంతరాలు ఏర్పడ్డాయన్నారు. నడవలేని స్థితిలో ఉన్న అవ్వ తాతలు ఏమి చేశారు చంద్రబాబు అంటూ ప్రశ్నించారు. పేదలకు ప్రతి ఇంటికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందచేశారని, ఆ కృతజ్ఞతతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు. 64వ డివిజన్ వైఎస్సార్ సీపీ అడ్డా అని అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో డివిజన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగిందన్నారు. కొన్ని చిన్న సమస్యలు వున్నాయని వాటిని గెలిచిన వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. బొండా ఉమా అనే వ్యక్తి డ్రామాలకు, నాటకాలకు, తాగుబోతులకు కేరాఫ్ అడ్రస్ అని దుయ్యబట్టారు. తాగిన మైకంలో ఏది పడితే మాట్లాడవద్దు అని హితవు పలికారు. బొండా ఉమా ఒక గజినీ అని పేర్కొన్నారు. వలంటర్లు లేకపోతే ఇంటింటికి పింఛన్లు ఏ రకంగా ఇవ్వగలరని ప్రశ్నించారు. చంద్రబాబు, బొండా ఉమాకు చిప్ పోయిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, కో ఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్, యరగొర్ల శ్రీరాములు, డివిజన్ కో ఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, కొక్కిలిగడ్డ నాని, ఇన్‌చార్జి జిల్లెల శివ, పందిరి వాసు, మురళీకృష్ణ, మాతా మహేష్, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు


నవభారతిని సత్కరిస్తున్న విద్యార్థులు

గన్నవరం: ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు, టీచర్స్ సంఘానికి దాసరి నవభారతి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు దాసరి నవభారతి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను యూటీఎఫ్ సంఘ నేతలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కారించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ రంగంలో 40 ఏళ్ల పాటు నవభారతి సుదీర్ఘమైన సేవలందించారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆమె రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఆమెను చూసి నేర్చుకోవచ్చాని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంఈఓ–1, 2లు కె.రవికుమార్, కమల, విశ్రాంత ఎంఈఓ జయబాబు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లెనిన్‌బాబు, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ బోర్డుల చోరీ


పాఠశాలను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ శ్రీవేద

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులు చోరీకి గురయ్యాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అవగాహన చేసుకునేందుకు వీలుగా రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) డిస్‌ప్లే బోర్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. పాఠశాలలోని తరగతి గదుల్లో బిగించిన ఈ ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులను దుండగులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో అపహరించారు. గది తాళాలు బద్దలుకొట్టి బోర్డులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విషయాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. పద్మజ ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యంపై బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లెనిన్‌నగర్‌కు చెందిన ఓ కుటుంబం తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమార్తె మధురానగర్‌కు చెందిన హర్ష అనే వ్యక్తిని ప్రేమించింది. ఆమె హర్షను ప్రేమిస్తున్నట్లు తన తండ్రికి తెలిపింది. దీంతో యువతి తండ్రి హర్ష తల్లిదండ్రుల సమక్షంలో పెద్దలతో మాట్లాడుకుని రెండేళ్ల తరువాత వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు.
హర్షతో మాట్లాడవద్దని, తన కుమారుడితో వివాహం చేయనని హర్ష వాళ్ల అమ్మ యువతితో చెప్పింది. హర్షను వాళ్ల బంధువుల ఇంటికి పంపించివేశారు. ఈ విషయం యువతి తన తండ్రి కృష్ణతో చెప్పి బాధపడింది. ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవటంతో గుణదల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

- చంద్రబాబు దుర్మార్గపు చర్యల వల్లే పింఛన్‌దారులకు అవస్థలు
- ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి


దేవీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్‌లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, పెత్తందారులకు జరుగుతున్న పోరాటంలో పేదల తరఫున అహర్నిశలు పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. సౌమ్యుడు, అందరికీ అందుబాటులో ఉండే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పెద్దల ఉసురు ఊరికే పోదు

చంద్రబాబు దుర్మార్గపు చర్యల వల్ల పింఛన్‌దారులు ఎండలో అవస్థలు పడుతున్నారని ఎంపీ కేశినేని నాని అన్నారు. చంద్రబాబు దుర్బుద్ధితో పింఛన్ ఇవ్వకుండా అడ్డుకోవటం వల్లే మండుటెండలో పింఛన్ కోసం వచ్చి వృద్ధులు మృత్యువాత పడుతున్నారని చెప్పారు. పెద్దల ఉసురు ఊరికే పోదని చంద్రబాబుకు తప్పక తగులుతుందన్నారు. వలంటరీ వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విషం కక్కుతూనే ఉన్నారన్నారు. చంద్రబాబుకు పేదలంటే లోకువ అని టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తే ఎగతాళిగా మాట్లాడటం ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. పెత్తందారులకు అండగా ఉండే చంద్రబాబుకు పేదలు బాగుపడటం ఇష్టం ఉండదన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తుండగా అసమానతలు పెంచేందుకు చంద్రబాబు అండ్ కో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల చేతిలో చంద్రబాబు కూటమికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

రౌడీ బొండాకు గుణపాఠం చెప్పాలి

తాగుబోతు, రౌడీ బొండాకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కేశినేని నాని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుని స్థలం కబ్జా చేసిన బొండా ప్రజలకు ఏం మంచి చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల్లో వెలంపల్లి శ్రీనివాసరావు 30 వేల ఓట్ల మెజారీతో గెలుస్తారని చెప్పారు.

ఫేక్ వ్యక్తి చంద్రబాబు

ప్రపంచంలో అత్యంత ఫేక్ వ్యక్తి చంద్రబాబు అని కేశినేని నాని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటరీ వ్యవస్థ, సచివాలయం వ్యవస్థ, విలేజీ క్లినిక్‌లను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు తానే ఇస్తానని చెబుతున్నారని తెలిపారు.

పేదలకు, పెత్తందారులకు యుద్ధం

పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న యుద్ధంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన పోరాటం చేస్తుండగా పెత్తందారీలకు చంద్రబాబు అండగా ఉన్నారన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశారని కానీ జగన్ మోహన్‌రెడ్డి ప్రతీ ఒక్కరూ అభివృద్ధి చెందాలని కృషి చేస్తున్నారని చెప్పారు. ఎండోమెంట్ అడ్వైజర్ జే.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తాము చేసిన మంచిని చూసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణారావు, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

17 మద్యం సీసాలు స్వాధీనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇన్నర్ రింగ్ రోడ్ సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఒక వ్యక్తిని గుణదల పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 17 తెలంగాణా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో గుణదల పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇంతలో చేతిలో ఒక సంచితో వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఎస్ఐ వెంకట్రావు సిబ్బందితో కలిసి సదరు వ్యక్తిని పట్టుకుని సంచిని పరిశీలించగా తెలంగాణాకు చెందిన 17 మద్యం సీసాలు కనిపించాయి. వివరాలు అడగ్గా తన పేరు చంద్రపాటి నరేంద్రబాబు అని ఒంగోలులో ఉంటున్నట్లు ఒక ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. తనకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో తాను కరీంనగర్‌లో 17 బీరు బాటిళ్లు కొనుగోలు చేసి విజయవాడలోని స్నేహితుడి ఇంటికి వెళ్తున్నట్లు తెలిపారు. గుణదల పోలీసులు మద్యం సీసాలను సీజ్‌చేసి కేసు నమోదు చేశారు.

టీడీపీ నేత నిర్వాకంపై ఆందోళన


బాపులపాడు సీఎస్ఐ చర్చి వద్ద ఆందోళన చేస్తున్న సంఘ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలను సంఘ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. విరాళాలు అందించిన దాతల వివరాలు, చర్చి నిర్మాణ ఖర్చుల వివరాలు తెలియజేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎస్ఐ చర్చి బిషప్‌కు సంఘస్తులు ఫిర్యాదు చేశారనే అక్కసుతో ఇప్పుడు ఏకంగా చర్చి నిర్మాణ పనులను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని సంఘస్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ అనుమతి లేకుండా చర్చి నిర్మాణం జరుగుతుందంటూ దయాల రాజేశ్వరరావు తన సొంత బావమరిది డొప్పల జయప్రకాష్‌ను అడ్డుపెట్టుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చారని దుయ్యబట్టారు. దీంతో ప్రస్తుతం నూతన చర్చిను అధికారులు సీజ్ చేశారని సంఘస్తులు వాపోయారు. చర్చి నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని గతంలో చెప్పినా దయాల రాజేశ్వరరావు ఇప్పుడు దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులకు ఇప్పుడూ ప్రార్థనా మందిరం లేకపోవటంతో నడిరోడ్డుపై నిలబడ్డామని వాపోయారు. చర్చి పునర్నిర్మాణ కమిటీకి సారథ్యం వహించిన దయాల రాజేశ్వరరావు నిర్వాకం వల్లే నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గోడును అర్థం చేసుకుని ప్రార్థనా మందిరంలోకి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు ఆంజనేయస్వామివారి గుడి ప్రాంతానికి చెందిన బడుగు శ్రీనివాసరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు.